దశలవారీగా పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12: దశల వారీగా పెండింగ్ పనులు పూర్తి చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం నగరంలోని ఆరో డివిజన్‌లో పాత బజార్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో వందల కోట్లతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని అన్నారు.. మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కోలమాలతి సంపత్, నాంపల్లి శ్రీనివాస్, నక్క పద్మ కృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 12: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాపంథా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇళ్లస్థలాలు, ఇళ్లు తదితర అనేక సమస్యల పరిష్కారానికి పేద ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని అన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఎందుకు పనికి రాకుండా పోయాయని అన్నారు. కొత్త రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా హామీల అమలు చేయడం లేదని విమర్శించారు. వ్యవసాయాన్ని సంక్షోభం నుంచి రక్షించడానికి, కనీస మద్దతు ధర కోసం కేంద్రంతో పోరాడాలన్నారు. వ్యవసాయ కార్మికుల కోసం చట్టం అమలు చేయాలని, వారికి 12 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. వివిధ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, జిందం ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, ప్రధాన కార్యదర్శి ఊకంటి లక్ష్మణ్, జి మల్లేశ్, బుడుగు కట్కూరి ఎనోస్, రాజయ్య, అజయ్, సిద్ధార్థ, అక్షయ్, గణేశ్, జిందం అభిరామ్ పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలి

భగత్‌నగర్, ఆగస్టు 12: దేశంలో శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ విద్యలో కాషాయికరణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎస్ఎఫ్ఐ అనేక ఉద్యమాలు పోరాటాలే కాకుండా విద్యార్థులకు శిక్షణ తరగుతులు నిర్వహించి సమాజంలో జరుగుతున్న అనేక అసమానతలపై విద్యార్థి ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడుతా య న్నారు. ప్రతి విద్యార్థికి రీ యింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపా ధ్యక్షుడు రజనీకాంత్, ఎం పూజ, అరవింద్, శ్రీకాంత్, శ్రీజ, అభిలాష్, వినయ్, ఇసాక్, సురేష్, సందేష్, రాకేష్, ఆకాష్ పాల్గొన్నారు.

20న సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం

భగత్‌నగర్, ఆగస్టు 12: హుజూరాబాద్‌లో ఈ నెల 20న నిర్వహిస్తున్నా సీపీఐ జిల్లా జనరల్ బాడీ, నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల చివరి వారంలో రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు హన్మకొండలో ఉంటాయన్నారు. సమావేశంలో పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, అందెస్వామి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, గూడెం లక్ష్మి, బత్తుల బాబు పాల్గొన్నారు.



గంగాధరలలో బెడ్స్ లేక పోవడంతో నేలపై పడుకున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి విజిట్

వసతి గృహాలు.. సమస్యల లోగిళ్లు

- దోమలు, క్రిమికీటకాల స్వైరవిహారం
- అలంకారంగా ఆర్వో ప్లాంట్లు
- బోరుబావులు, కలుషిత నీటితోనే వంటావార్పు
- తాగేందుకు కూడా అవే నీరు
- జ్వరాలు, వ్యాధుల బారిన పడుతున్న విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. దేశంలోనే ఆదర్శంగా సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల కోసం గురుకులాలను, హాస్టళ్లను ఏర్పాటు చేసి సన్నబియ్యంతో కూడిన రుచికరమైన భోజనం కల్పిస్తున్నా మంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. క్షేత్రస్థాయిలో హాస్టళ్లు, వసతి గృహాల్లో అనేక సమస్యలు విద్యార్థులను వెంటాడుతున్నాయి.

● శిథిలావస్థకు చేరిన భవనాలు

శిథిలావస్థకు చేరిన భవనాల్లో కొన్ని, ఇరుకైన అద్దె భవనాల్లో మరికొన్ని వసతిగృహాలను నిర్వహిస్తున్నారు. వర్షాకాలం, చలి కాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది హాస్టల్ విద్యార్థులు అనారోగ్యాలబారిన పడుతు న్నారు. ఇప్పటికే ఎంతో మంది హాస్టల్ విద్యార్థులు విషజ్వరాలు, వాంతులు, విరేచనాలు, తదితర వ్యాధులకు గురైనట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

● కనీస వసతులు కరువు

జిల్లాలో ఎస్సీ, బీసీ, గిరిజన అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో 12 కేజీబీవీలు, బీసీ సంక్షేమకు చెందిన 11 పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్ళు, ఎనిమిది ప్రీమెట్రిక్ హాస్టల్స్, గిరిజన సంక్షేమశాఖలో పోస్టు మెట్రిక్ రెండు, ప్రీమె ట్రిక్ మూడు, ఎస్సీ సంక్షేమశాఖలో పోస్ట్‌మెట్రిక్ 9, ప్రీమెట్రిక్ 20, ఒక ఆశ్రమ పాఠశాల ఉన్నాయి. గురుకుల, మోడల్, ఆశ్రమ పాఠశాలల్లో పలు సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చొప్పదండి ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పాత భవనం, జమ్మికుంటలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనాలతోపాటు మరికొన్న చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకు న్నప్పటికీ వాటికి మరమ్మతులు చేయడం లేదు. చాలా చోట్ల బాత్‌రూమ్, టాయిలెట్లకు తలుపులు లేక పోవడం, కిటికీలకు దోమ తెర బిగించక పోవడం, వర్షపు నీరు భవనం చుట్టూ నిలువడం వంటి కారణాలతో దోమలు పెరిగి పోయి విద్యార్థులు అనారోగ్యాలకు గురవు తున్నారు. సైదాపూర్, గంగాధర, తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలల హాస్టళ్లలో స్నానపు గదుల, మరుగుదొడ్లకు తలుపులు లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పలు చోట్ల ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో చాలా మేరకు పని చేయడం లేదు. దంతో బోర్‌వెల్ నీటిని తాగునీటికి, వంటకు వినియోగిస్తున్నారు. ఇప్పటికీ విద్యార్థులకు బెడ్స్, బెడ్ షీట్లు ఇవ్వక పోవడంతో ఇబ్బంది పడుతు న్నారు. ఇప్పటి వరకు యూనిఫామ్స్, పుస్తకాలు పూర్తిస్థాయిలో అందించ లేదు. 24 గంటల పాటు పర్యవేక్షణ చేయాల్సిన వార్డెన్లు హాస్టళ్లలో ఉండడం లేదు. కమాటీలు, వంట మనుషులు అందుబాటులో లేక పోవడంతో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి భోజనం తయారు చేస్తున్నారు. అక్కడక్కడ భోజనంలో రాళ్లు రావడం వంటి సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చాలా వసతి గృహాల్లో నాలుగో తరగతి సిబ్బంది లేరు. ఓవైపు మౌలిక సదుపాయాల కొరత, మరోవైపు సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నందున ఇప్పటికైనా అధికారయంత్రాంగం, ప్రజా ప్రతినిధులు స్పందించి హాస్టల్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండి ఎస్సీ గర్ల్స్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో పనిచేయని ఆర్‌వోఆర్ ప్లాంట్ మిషన్



సైదాపూర్ కేజీబీవీ పాఠశాలలో నిలిచి ఉన్న మురుగునీరు

బాత్‌రూంలు బాగు చేయించండి

- రవళి, పదో తరగతి, ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్, ఎల్ఎండీ కాలనీ

హాస్టల్ 20 బాత్‌రూంలు ఉన్నాయి. వాటిలో సగం బాత్‌రూంలకు తలుపులు బాగాలేవు. విధిలేక వాటినే ఉపయోగిస్తున్నాం.. బాత్‌రూంలకు మరమ్మతులు చేయించాలి. దోమలు తీవ్రంగా ఉన్నాయి. చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు..

కామారపు సుధాకర్, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్, చింతకుంట ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల

గురుకుల కళాశాలలో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు కలిసి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశాం. కళాశాల ఆవరణలో వర్షం నీరు నిలుస్తే అందరం కలిసి తొలగించాం. బయట వ్యక్తులు, పోకిరీలు గోడ దూకి లోపలికి వస్తున్నారు. భోజనంలో రాళ్లు, పురుగులు వస్తున్నాయని విద్యార్థులు అంటున్నారు.




గంగాధరలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోని తలుపులేని స్నానపు గదులు

కరీంనగర్‌కు ఎలక్ట్రిక్ బస్సులు

భగత్‌నగర్, ఆగస్టు 12: కరీంనగర్ రీజియన్‌కు త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. రీజియన్‌లో 70 బస్సులను కరీంనగర్-జెబీఎస్, కరీంనగర్-గోదావరిఖని, కరీంనగర్-మంథని, కరీంనగర్-కామారెడ్డి, కరీంనగర్-జగిత్యాల, కరీంనగర్-సిరిసిల్ల (నాన్‌స్టాప్)కు నడపనున్నట్లు తెలిపారు. తొలివిడతగా 33 సూపర్‌లగ్జరీ బస్సులను (జిసిసి- గ్రాస్‌కాస్ట్ కాంట్రాక్టు) అద్దె ప్రాతిపదికన నిర్వహిస్తామన్నారు. అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు పూర్తయిన తర్వాత ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తామన్నారు.

మిడ్‌మానేరు నుంచి 'తోటపల్లి'కి నీటి విడుదల

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 12: మిడ్ మానేర్ ప్రాజెక్ట్ నుంచి బెజ్జంకి మండలంలోని తోటపల్లి రిజర్వాయర్‌లోకి నీటిని సోమవారం శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్(ఎస్సారెస్పీ) అధికారులు విడుదల చేశారు. వాస్తవానికి ఈనెల 15వ తేదీన మిడ్ మానేరు నుంచి నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. నీరు లేక నారు మళ్లు ఎండిపోయే దశకు చేరుకున్నాయని రైతులు మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణతో మొరపెట్టుకోవడంతో ఆయన సమస్య తీవ్రతను ఎస్సారెస్పీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీనికి స్పందించిన ఎస్సారెస్పీ అధికారులు గడువుకు ముందుగానే నీరు విడుదల చేశారు. మొన్నటి వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి మిడ్ మానేరులోకి వరద నీరు వచ్చి చేరింది. మిడ్ మానేరు నుంచి అనంతగిరి ప్రాజెక్టుకు అక్కడి నుంచి ఇల్లంతకుంట, బెజ్జంకి, గన్నేరువరం మండలాల సాగులో ఉన్న పంటపొలాలకు నీరందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 15న నీటి విడుదలను ప్రారంభించాలని అధికారులు సన్నాహాలు చేశారు. రైతుల కోరిక మేరకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విషయాన్ని ఎస్సారెస్పీ అధికారులకు తెలిపారు. స్పం దించిన అధికారులు వెంటనే మిడ్ మానేరు నుంచి కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మిడ్‌మానేరు కుడికాలువ ద్వారా విడుదలవుతున్న నీరు





జాతీయ గీతాలాపనలో వందనం చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, తదితరులు

నెహ్రూ అరాచకం వల్లే విభజన గాయాలు

- కులమతాలతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న కాంగ్రెస్
- హర్ ఘర్ తిరంగా యాత్రలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



జెండాతో ర్యాలీలో పాల్గొన్న బండి సంజయ్

కరీంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నెహ్రూ అరాచకాల వల్లే విభజన గాయాలు వెంటాడుతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో హర్ ఘర్ తిరంగా యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలు, ప్రాంతల పేరుతో ప్రజల మధ్య కాంగ్రెస్ పార్టీ చిచ్చు పెడుతుందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చైనా ఆలోచనలు అమలుచేస్తే వ్యక్తి అన్నారు. చైనా ఆదేశాలతోనే బంగ్లాదేశ్ ఘటనపై నోరు విప్పడం లేదన్నారు. నెహ్రూ కుటుంబానికి రాజకీయ లబ్ధి కోసమే దేశ మహనీయుల త్యాగాలను కనుమరుగు చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలను తెరమరుగుచేస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందాలనే లక్ష్యంతో పాటు మహనీయుల త్యాగాలను స్మరించుకునేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. మైనార్టీ సంతుష్టీకరణ విధానాలే దేశ ంలో అనిశ్చితికి కారణమన్నారు. కాంగ్రెస్ చేసిన పాపాలను బీజేపీ కడిగే పనిచేస్తే తప్పు పడుతున్నారన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లుకు నెహ్రూ, పీవీ, మన్మోహన్ హయాంలో సహరిస్తే తప్పులేదటకాని, ఆ తప్పులను సరిదిద్దేందుకు వక్ఫ్‌బోర్డు బిల్లు తీసుకు వస్తే తప్పు పడతారా అని ప్రశ్నించారు. మతం పేరుతో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్రలుపన్నుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగుర వేయడం, సెమినార్లు నిర్వహించడం దేశంకోసం త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలను శుద్ధి చేసి పుష్పార్చన చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రంగుల జాతీయజెండా మనందరి ఆత్మగౌరవ పతాకం అని, జెండా ఎజెండాలను పక్కన పెట్టి చిన్న పెద్దతేడా లేకుండా ప్రతిఒక్కరు తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేయాలన్నారు. దేశ భక్తుల ఫొటోలను పంద్రాగస్టు వరకు వాట్సప్ డీపీలుగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడు తమ ఇంటిపై జెండాను ఎగురవేయాలన్నారు. ఈ విషయంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

● కదం తొక్కిన కాషాయ దళం

భగత్‌నగర్: కరీంనగర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా యాత్రలో కాషాయ శ్రేణులు కదం తొక్కాయి. నగరంలోని తెలంగాణ చౌక్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ త్రివర్ణ పతాకాన్ని చేతబూని పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. నగరంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి తెలంగాణ చౌక్‌కు చేరుకుని ర్యాలీని ప్రారంభించారు. అనంతరం భారీ త్రివర్ణ పతాకాన్ని చేతబూని ర్యాలీగా తరలి వెళ్లారు. బీజేపీ కార్యర్తలు పెద్ద సంఖ్యలో నగర వీధుల్లో జెండాలను చేతబూని భారత్‌మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

బాలికపై అత్యాచారయత్నం కేసులో
నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

జగిత్యాలరూరల్, ఆగస్టు 12: ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి చెందిన బాలికను నిందితుడు సాయిని గంగన్న (26)అనే వ్యక్తి అత్యాచారయత్నం చేసిన ఘటనలో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ఘటన జరిగిన సమయంలో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో ఆధారా లు సమర్పించారు. సాక్షులను విచారించిన జగిత్యాల న్యాయమూర్తి నీలిమ ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసినవారు శిక్ష నుంచి తప్పించు కోలేరన్నారు. నిందితుడికి జైలుశిక్ష పడేందుకు కృషి చేసిన పీపీ మల్లికార్జున్, ఎస్సై శ్రీకాంత్, సీఎంఎస్ ఎస్‌ఐ రాజునాయక్, కోర్టు కానిస్టేబుల్స్ కిరణ్, రాజులను జిల్లా ఎస్పీ అభినందించారు.

కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేస్తే నగదు మాయం

జమ్మికుంట రూరల్, ఆగస్టు 12: జమ్మికుంట మండలం నాగంపేట గ్రామానికి చెందిన పంజాల తిరుపతి అనే వ్యక్తి తన స్నేహితుడికి ఫోన్‌పే ద్వారా కొంత నగదును పంపాడు. నగదు ట్రాన్స్‌ఫర్ కాకపోవడంతో గూగుల్‌లో సెర్చ్ చేసి ఆంధ్రాబ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేశాడు. వారు అడిగిన వివరాలన్నీ చెప్పాడు. అప్పటి నుంచి విడతల వారీగా 1,40,999 రూపాయలు బ్యాంకు ఖాతా నుంచి మాయమయ్యాయి. వెంటనే తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

కారును ఢీ కొన్న డీజిల్ ట్యాంకర్

శంకరపట్నం, ఆగస్టు 12: మండలంలోని కొత్తగట్టు శివారులో కరీంనగర్- వరంగల్ రహదారిపై సోమవారం కారును డీజిల్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీ కొట్టిం ది. స్థానికుల కథనం ప్రకారం వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు ను వెనక నుంచి వస్తున్న డీజిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో కారు వెనుక భాగం దెబ్బతిన్నది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న కేశవపట్నం బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 12: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,580 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీ కి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 430 క్యూ సెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.890 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ప్రాజె క్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గడం తో ఒక మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.49 టీఎంసీల నీరు ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.13 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మధ్యమానేరు ద్వారా వచ్చిన 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు..

జగిత్యాల, ఆంధ్రజ్యోతి: శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను సోమవారం అధికారులు కొన సాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 4,083 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 4,083 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పీఏసీఎస్ సభ్యులు విధిగా కేవైసీ చేయించుకోవాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12: కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 128 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) సభ్యులంతా తప్పనిసరిగా కేవైసీ వివరాలను డిజిటలైజేషన్ చేయించుకోవాలని బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని కేడీసీసీ బ్యాంకుకు అనుబంధంగా ఉన్న సంఘాల్లోని సభ్యుల కేవైసీ వివరాలను ఆయా సంఘాల్లో కంప్యూటరైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్సు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని ఆయా సంఘాల్లో సంప్రదించాలని సూచించారు.

అత్త వేధింపులు భరించ లేక
కోడలు ఆత్మహత్య


సృజన (ఫైల్)

కోరుట్ల, ఆగస్టు 12 : కోరుట్ల పట్టణంలో అత్త వేధింపులు భరించలేక కోడలు సోమవారం ఆత్మ హత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని గంగ పేట ప్రాంతంలో నివాసం ఉంటున్న పులివేని నరేష్‌తో ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బ గ్రామానికి చెందిన సృజన (28) ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. నరేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. సృజన గంగంపేట ప్రాంతంలో ఆమె పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో సృజన అత్త ఎకశిల నిరంతరం వేధింపులకు పాల్పడేది. ఈ క్రమంలో సోమవారం ఉదయం అత్త ఎకశిల కోడలితో గొడవ పడింది. దీంతో సృజన విషయాన్ని భర్తకు ఫోన్ ద్వారా వివరించింది. తాను పిల్లలను విడిచి వెలుతున్నానని, పిల్లలను బాగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టివేసి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో నుంచి సృజన బయటకు రాకపోవడంతో చుట్టు పక్కల వారు గమనించి ఆత్మహత్య పాల్పడ్డట్లు గుర్తించారు. విషయాన్ని సృజన బంధువులకు, పోలీసులకు సమా చారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి సృజన తల్లి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సృజనకు విధన్ (5), వియాన్ (3) కుమారులు, లింకారి (8నెలల) కూతురు ఉంది. తల్లి మృతదేహం వద్ద పిల్లలు అమ్మ లే అమ్మా అంటూ ఏడుస్తూ లేపే ప్రయత్నం చేస్తుండగా అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది. సృజన భర్త నరేష్ గల్ఫ్ నుంచి మంగళవారం చేరుకుంటాడు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నెమలి వంట.. యూట్యూబర్ రిమాండ్

తంగళ్లపల్లి, ఆగస్టు 12: నెమలి మాంసం ఎలా వండాలో చూపించిన వీడియో యూట్యూబ్‌లో వైరల్ చేసిన యూట్యూబర్ తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కోడం ప్రణయ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ ఆర్వో కల్పనదేవి తెలిపారు. జాతీయ పక్షి నెమలిని ఎలా కూర వండాలో సోషల్ మీడియాలో వైరల్ కాగా ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికా రులు ప్రణయ్‌కుమార్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. యూట్యూబర్ ప్రణయ్‌కుమార్‌ను విచారించి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు

రుద్రంగి, ఆగస్టు 12: అజర్ బైజాన్ దేశం పంపిస్తానని ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు రుద్రంగి ఎస్ఐ అశోక్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మానాల గ్రామానికి చెందిన కొలకాని రవి అనే వ్యక్తిని అజర్ బైజాన్ అనే దేశం పంపిస్తానని రూపాయలు 2.75,000 తీసుకొని వీసా ఇవ్వకపోవడంతో పాటు, డబ్బులు తిరిగి ఇవ్వకుండా నమ్మించి మోసం చేశాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అగ్నీర కిషన్‌పై ఇప్పటికే రుద్రంగి పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదు కాగా వివిధ పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసులు నమోదు కావడంతో ఇప్పటికే అజ్మీరా కిషన్ జైల్లో ఉన్నట్లు తెలిపారు. బాధితు లు ఎవరైనా ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

రాజన్న క్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు

● శ్రావణం సందర్భంగా పెరిగిన రద్దీ ● సాయంత్రం ఘనంగా మహాలింగార్చన



ఆలయ ఆవరణలో, క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 12 : వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్తులతో కిక్కిరిసి పోయింది. శ్రావణ మాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం రోజున భక్తులు వేములవాడకు తరలివచ్చి శ్రీస్వామి వారి వసతిగదుల్లో విడిది చేశారు. సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు సుమారు రెండు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. బ్రేక్ దర్శనం, శీఘ్రదర్శనం, ధర్మదర్శనం క్యూలైన్ ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని ముందుగా శ్రీవిఘ్నేశ్వరుడిని దర్శించుకుని శ్రీపార్వతిపరమేశ్వరుల సేవ లో తరించారు. సోమవారం రాజన్న దర్శనానికి 35 వేల మంది వరకు భక్తులు వచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయంలో ఉదయం 5.30 గంటలకు మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం శ్రీస్వామి వారి కల్యాణ మంటపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

క్యూలైన్‌లను పరిశీలించిన ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేం దుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం కోడెమొక్కు, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాజన్న ఆలయా నికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఏఈవో రమేష్ బాబుకు, ప్రొటోకాల్ పర్యవేక్షకులు రాజన్‌బాబులను ఆదేశించారు.



కల్యాణ మంటపంలో లింగార్చనలో పాల్గొన్న భక్తులు, బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను పరిశీలిస్తున్న ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో రమేష్‌బాబు, పీఆర్వో రాజన్ బాబు

క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదగాలి

● జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి ● ముగిసిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు




ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలతో అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 12: జిల్లా క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదగాలని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో కరీంనగర్ జిల్లా టేబుల్ టెన్నీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం ముగి శాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా టేబు ల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శరత్‌కుమార్‌రెడ్డి, ప్రధా న కార్యదర్శి సురేందర్‌సింగ్‌లు ట్రోఫీలను, ప్రశంసాపత్రాలను అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నిర్వహి స్తున్న ఈ పోటీల్లో విజేతలకుగా నిలిచిన వారికి రూపాయ లు 25 వేల నగదు బహుమతులను అందజేస్తున్నామని చెప్పారు. టేబుల్ టెన్నిస్ క్రీడతో ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందుతుందని అన్నారు.

రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల నుంచి 200 మంది క్రీడా కారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అండర్-12, 15 పురుషులు, మహిళ ల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలను నిర్వ హించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కోశాధికారి దారం గౌతమ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మద్దెల వికాస్ కుమార్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు పాల్గొన్నారు.

● పోటీల విజేతలు :

పురుషుల సింగిల్స్ విభాగంలో లోకేష్ (కొత్తగూడెం), సంతోష్ (కరీంనగర్), పి.అజయ్ (కరీంనగర్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. డబుల్స్ విభాగంలో లోకేష్, చైతన్య (కొత్తగూడెం), శైలేం దర్, కిరణ్ (మంచిర్యాల) మొదటి, రెండు స్థానాల్లో నిలిచారు. మిక్స్ డ్ డబుల్స్ విభాగంలో వినయ్‌సాగర్, శ్వేత (నిజామాబాద్) ప్రథమ స్థానం, పి.అజయ్, అవనిరెడ్డి (కరీంనగర్) ప్రథమ, ద్వితీ య స్థానాలు సాధించారు. అండర్-15 బాలుర విభాగంలో జ్వలిత్ (ఖమ్మం), పి.అజయ్ (కరీంనగర్), సార్విక్ (ఖమ్మం) మూడు స్థానాల్లో నిలువగా బాలికల విభాగంలో సత్య (మంచిర్యాల), వై.అవనీరెడ్డి (కరీంనగర్), అక్షర (నిజామాబాద్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్-12 బాలుర విభాగంలో హితేష్ (ఖమ్మం), ఫజల్ (ఖమ్మం), వి.శ్రేయాస్ (కరీంనగర్) మొదటి మూడు స్థానాల్లో నిలువగా బాలికల విభాగంలో సింధూ (నిజామాబాద్), రవళిక (నిజామాబాద్), అనన్య (నిజామాబాద్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

శివాలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు


రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పూజలు

ధర్మపురి, ఆగస్టు 12: ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి నెలకొంది. శ్రావణ సోమవారం శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. క్షేత్రానికి ఉదయం వరకు తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర, క్షేత్ర సమీపంలో గల అక్కపెల్లి రాజ రాజేశ్వరస్వామి ఆలయాలకు చేరుకున్నారు. ఆలయ వేదపండితులు, అర్చకు లు శివాలయాల్లో స్వామి వారలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజ లు, అన్నపూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని నంది వాహ నంపై పుర వీధుల్లో ఊరేగించారు. స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శ నం చేసుకున్నారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, బూస ప్రవీణ్ కుమార్, జన్మంచి శ్రీనివాస్, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.


స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

కోటిలింగాలలో...


గోదావరిలో స్నానం చేస్తున్న భక్తులు

వెల్గటూర్, ఆగస్టు 12: శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా మండ లంలోని కోటిలింగాలలో భక్తుల సందడి నెలకొన్నది. శ్రీ కోటేశ్వరస్వామికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మారు మ్రోగింది. కోటిలింగాల గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించి గోదావరి ఒడ్డున గల గంగా మాత విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం కోటేశ్వర స్వామి ఆల య ప్రాంగణంలోని రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి జంట నాగులకు ప్రత్యేక పూజలు చేసి, పాలతో అభిషేకం చేశారు. శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించు కొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం కిట కిటలాడింది. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

దేవాదాయశాఖ ఏసీగా సుప్రియకు అదనపు బాధ్యతలు

నేడు బాధ్యతల స్వీకరణ



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12: ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమీషనర్ కార్యాలయంలో సూప రింటెండెంట్‌గా పనిచేస్తున్న నాయిని సుప్రియకు ఉమ్మడి జిల్లా సహాయ కమీషనర్(ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఆ శాఖ రాష్ట్ర కమీషనర్ హను మంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. మొన్నటి వరకు ఆమె నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఏసీగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాజాగా జరిగిన బదిలీలో అక్కడికి కొత్త ఏసీ రావడం తో తిరిగి కరీంనగర్ సూపరింటెండెంట్‌గా పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఏసీగా కూడా వ్యవహరించనున్నారు. గతంలో ఇక్కడ ఏసీగా పనిచేసిన ఆకునూరి చంద్రశేఖర్ మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. సుప్రియ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

బంగారం షాపులో చోరీ

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 12: పట్టణంలోని మిషన్ హైస్కూల్ ఏరియాలోగల ఓ బంగారం షాపులో ఆదివారం రాత్రి చోరీ జరి గింది. సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి షెట్టర్ తాళాలు పగుల గొట్టి లోనికి చొరబడి 2 తులాల బంగారం, అర కిలో వెండి అపహరిం చుకెళ్లారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

రెండు దుకాణాల్లో..

శంకరపట్నం: మండలంలోని సైదాపూర్ ఎక్స్ రోడ్ వద్ద గల చికెన్ సెంటర్, హోటల్ తాళాలు పగులగొట్టి వాటిలో ఉన్న 15 వేల రూపాయలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. చికెన్ సెంటర్‌లో ఐదు వేలు, హోటల్‌లో 10 వేల రూపాయల దొంగతనం జరిగిందన్నారు. బాధితులు జునమూర్ తిరుపతి, చిర్ర సం తోష్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో..

గంగాధర: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో తాళం వేసి ఉన్న ఇం ట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సాగర్‌రెడ్డి ఆదివారం సా యంత్రం తన బంధువుల ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తు లు తలుపులు ఊడదీసి ఇంట్లోకి వెళ్లి బీరువాలోని 50 వేలు ఎత్తు కెళ్లారు. తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన పొరుగువారు సా గర్‌కు సమాచారం అందించారు. ఆయన వచ్చి చూడగా బీరువా లోని నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఆగస్టు 12: మండలంలోని మెట్‌పల్లి గ్రామం లో సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వీణ వంక మండలం జంగంపల్లి నుంచి మెట్‌పల్లి వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. జంగంపల్లికి చెందిన డ్రైవర్ రేగుల తిరుపతి సరైన పత్రాలు చూపకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

ఘనంగా కుంకుమ పూజలు


కుంకుమ్మ పూజలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల, ఆగస్టు 12 : పట్టణంలోని జవ హర్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయం లో శ్రావణమాస రెండవ సోమవారం పురస్కరించుకొని కుంకుమ పూజా మహోత్స వం ఘనంగా నిర్వహించారు. వేదపండితు లు పాలెపు రామకృష్ణ శర్మ వేద మంత్రోచ్చా రణల మధ్య ప్రత్యేక పూజలను జరిగాయి. గణపతి, పుణ్యాహవచనం పూజలను నిర్వ హించిన సామూహిక శివ ముష్టి వత్రాలను నిర్వహించారు. అనంతరం మహిళలచే కుం కుమ పూజ నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అల్లాడి ప్రవీణ్, చిద్రాల వినోద్, తాటికొండ ఆంజనేయులు, కంఠాల బాస్కర్, బట్టు హరికృష్ణ, జిల్లా శ్రీనివాస్‌లతో పాటు మహిళలు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

పెగడపల్లి, ఆగస్టు 12: ఎరువులు, పురుగు మందుల దుకాణంలో పని చేస్తూ మోసానికి పాల్పడిన మారిశెట్టి మధు అనే వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిం చినట్లు ఎస్.ఐ రవికిరణ్ తెలిపారు. ఎస్.ఐ రవి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం బతికె పల్లి గ్రామానికి చెందిన మారిశెట్టి మధు అదే గ్రామానికి చెందిన క్యాస కృష్ణ అనే వ్యక్తికి చెందిన సుద్దపల్లి గ్రామంలోని ఫర్టి లైజర్ షాపులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. షాపులో ఖాతాదారుల వద్ద నుంచి రూ. 2 లక్షలు వసూలు చేసుకుని వాడుకోవడంతో పాటు వాటిని కప్పి పుచ్చుకు నేందుకుగాను షాపునకు చెందిన రూ. 20 లక్షల ఉద్దెర ఖాతా బుక్కలను కాల్చి వేశాడు. దుకాణ యజమాని ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ అనంతరం కేసు నమోదు చేసి మధును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ తెలిపారు.

కొండ చిలువ సంచారం



సిరిసిల్ల టౌన్, ఆగస్టు 12 : రాజన్న సిరిసిల్ల కేంద్రం లోని విద్యా నగర్ శివారు ప్రాంతం వైకుంఠ ధామం ప్రాంతంలో దాదాపు ఆరు అడుగుల పొడవు ఉన్న కొండ చిలు వ సంచరిస్తోంది. ఓ వ్యక్తికి కొండ చిలువ కనపడడంతో వీడియో తీసి సోమవారం సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అవుతుంది. ఈ దృశ్యాలను చూసిన పట్టణ ప్రజలు అటు వైపు వెళ్లడానికి సాహసించడం లేదు. కొండచిలువ సంచారంతో ఆదే ప్రాంతంలో ఉన్న బీసీ గురుకుల పాఠశాల లోని విద్యార్థులు భయపడుతున్నారు. వైకుంఠధామంకు మరో వైపు నెహ్రూపార్క్, స్విమ్మింగ్ పూల్ జనంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అటు వైపు కొండ చిలువ వస్తే ఎలా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరుగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

శంకరపట్నం, ఆగస్టు 12: ఐదు నెలల క్రితం ఓ మహి ళ పోగొట్టుకున్న మొబైల్‌ను కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తిరిగి సోమవారం అప్పగించారు. ఎస్ఐ రవి శంకర పట్నం మండలం కన్నాపూర్‌కు చెందిన ఎండీ సఫియా ఐదు నెలల క్రితం స్మార్ట్ ఫోన్ పోయిందని సీఈ ఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవి దర్యాప్తులో మొబైల్‌ని కనుక్కు ని తిరిగి ఫిర్యాదుదారురాలికి అప్పగించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మల్యాల, ఆగస్టు 12: కొండగట్టులోని ఓ గదిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏ.నరేష్ కుమార్ సోమవారం తెలిపారు. ఇందులో కొడిమ్యాలకు చెందిన ఇద్దరు, కోరుట్లకు చెందిన ఇద్దరు, మే డిపల్లి, జగిత్యాల, కొండగట్టుకు చెందిన ఒక్కరు ఉన్నా రని వారి వద్ద రూ.44,060 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

-టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 12: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి పంపిణీ వ్యవస్థను పటిష్ఠ పరుస్తున్నట్టు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. గత 8 నెలల్లో కొత్తగా వివిధ సామర్థ్యం గల 539 ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టామని తద్వారా ఓవర్ లోడ్ భారం తగ్గిందని అన్నారు. వదులుగా ఉన్న లైన్‌లు ఉన్న చోట 1769 మిడిల్ పోల్‌లను ఏర్పాటు చేశామన్నారు. 1,845 కొత్తపోల్‌లు వేశామన్నారు. 28 ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచామని అన్నారు. పాత లైన్లను మార్చి, కొత్త 51కిఎం మీటర్ల లైన్లు వేశామని తెలిపారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్న చోట్ల సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యాన్ని పెంచామని అన్నారు. వినియోగదారులకు ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ధరణి ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా మహేష్



కరీంనగర్ అర్బన్, ఆగస్టు12: ధరణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేష్‌ను సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన కొనగాల మహేష్ కాంగ్రెస్‌పార్టీ యువజన, ఇతర విభాగాల్లో పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ధరణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్‌ప్లాజాలో జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, కోఆర్డినేటర్లు పాల్గొన్న ఈ సమావేశంలో కొనగాల మహేష్‌ను గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్న అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొనగాల మహేష్ మాట్లాడుతూ ధరణి పేరుతో కేసీఆర్ కుటుంబ సభ్యులు భూములు దోచుకున్నారని ఆరోపించారు. ధరణి ఉద్యోగులు కేసీఆర్ ప్రభుత్వంలో 11 నెలలపాటు జీతాలు లేక పస్తులున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఖజానా నుంచి ఒక్కొక్కరి పేరిట 29 వేల చెల్లించగా థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా కేవలం 12 వేలు మాత్రమే ఉద్యోగులకు చెల్లించారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే ధరణి ఉద్యోగులకు సంబంధించి ఫిబ్రవరిలో 9నెలల జీతాలను చెల్లించినట్లు తెలిపారు. ధరణి ఉద్యోగలను గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. మరణించిన ఉద్యోగలకు కనీస సహాయాన్ని అందించలేదన్నారు. ధరణి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని కొనగాల మహేష్ తెలిపారు. ఈ సమావేశంలో ధరణి ఉద్యోగుల సంఘం నాయకులు పురుషోత్తం, శివ, మహేష్‌తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌పై కార్పొరేటర్ ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, ఆగష్టు12: ఎస్సీ రిజర్వేషన్ డివిజన్‌కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయకుండా కార్పొరేటర్‌ను కించపరుస్తున్న మేయర్ వైసునీల్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ మంగళవారం రెండో ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీలత చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ నగరంలో ఎస్సీ, ఎస్టీ డివిజన్‌లలో అభివృద్ది పనులకు 15శాతం బడ్జెట్‌ను కేటాయించాలని నిబంధన ఉన్నప్పటికి 44వ డివిజన్‌కు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు మేయర్‌కు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. 2023లో మురికి కాలువ నిర్మాణం కోసం 24లక్షలు కేటాయించి కౌన్సిల్ తీర్మానం చేసి టెండర్ పూర్తయిన పనిని కూడా మేయర్ ఉద్దేశ్య పూర్వకంగా రద్దు చేశారని ఆరోపించారు. మేయర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు: మేయర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 12: కార్పొరేటర్‌కు ఏవైనా సమస్యలుంటే పరిష్కరిస్తామని, కానీ తప్పుడు ఆరోపణలు చేయటం సరికాదని కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 44వ డివిజన్ కార్పొరేటర్ తన డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా కించపరిచాడని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసిందని, ఈ విధానం సరైనది కాదని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌లు, అందరు కార్పొరేటర్లను సమంగానే చూస్తున్నామని అన్నారు. ఎక్కడా వివక్ష లేకుండా నగర అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఇందులో బేదాభిప్రాయాలకు తావులేదని మేయర్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 12: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ హర్ ఘర్ రోజ్‌గార్ కార్యక్రమం చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించి స్వాతంత్ర దినోత్సవం రోజున కరీంనగర్ ప్రజలు జెండా ఆవిష్కరణతో పాటు నీ ఫొటోకు క్షీరాభిషేకం చేయించుకునేలా చూడాలని సూచించారు. ఉపన్యాసాలు మాని ప్రజల కోసం పనిచేయాలని హితవు పలికారు. దేశ సమైక్యత, సమగ్రత, దేశభక్తి పెంపొందించడం కోసం ప్రతి ఒక్కరూ జెండా ఎగురవేయడం, దేశ మహనీయులను స్మరించుకోవడం మన లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా ఇప్పుడైనా కనీసం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే లక్ష్యంతో ముందుకెళ్లాలని బండి సంజయ్‌కు వెలిచాల రాజేందర్‌రావు సూచించారు. సంచలనాల కోసం కాంగ్రెస్ విమర్శించడం పనిగా పెట్టుకోవద్దని అన్నారు. ప్రజల మెప్పు పొందేలా అభివృద్ధి చేసి చూపించాలని కేంద్ర మంత్రికి వెలిచాల రాజేందర్‌రావు హితవు పలికారు.

క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవచ్చు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12: ప్రతి విద్యార్థి క్రమశిక్షణను అలవర్చుకుంటే లక్ష్యాలను చేరుకోవచ్చని మెకానిల్ ఇంజనీరింగ్ అధిపతి, డీన్ డాక్టర్ ఎంవీ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ లో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణలో భాగంగా పర్సనాలిటీ డెవలప్‌మెంట్, గోల్ సెట్టింగ్ అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కెప్టెన్ రవీంద్రబాబు, డీసీ ఇన్‌చార్జిలు మేజర్ సాగర్‌సింగ్, జె సూర్యప్రసాద్, వికాస్‌కుమార్, గులాబ్‌సింగ్, లెఫ్టినెంట్ శ్రీలత, రాజు, నవీన్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి గ్రామస్థుల ఆర్థిక సాయం

సైదాపూర్, ఆగస్టు 12: మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన నిరుపేద స్వర్ణకారుడు కందుకూరి నిరంజన్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన దహన సంస్కాలకు కూడా డబ్బులు లేని స్థితిలో వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. దీంతో గ్రామస్తులు ముందుకు వచ్చి విరాళాలు పోగు చేసి 1.9 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. నిరంజన్ కుటుంబం పేదరికంలో ఉందని, ఎవరైన దాతలు వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖబరస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక



ముజాహిద్ హుస్సేన్

హుజూరాబాద్, ఆగస్టు 12: హుజూరాబాద్ జామే మసిద్ ఈద్గా, ఖబరస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలో టౌన్ సీఐ తిరుమల్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి మహ్మద్ సలీం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా మహ్మద్ ముజాహిద్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ హబీబ్, జనరల్ సెక్రెటరీగా మహ్మద్ అబ్దుల్ రఫీమున్ను, జాయింట్ సెక్రటరీగా మహ్మద్ బాబా తాజుద్దీన్ ఇర్ఫాన్, కోశాధికారిగా ముజాహిద్ ఖాన్, కార్యవర్గ సభ్యులుగా మహ్మద్ అంజద్, మహ్మద్ యాసిన్‌ఖాన్, మహ్మద్ ఫయాజుద్దీన్, జమీల్, అహ్మద్, సయ్యద్ మహ్మద్, ఇమ్రాన్‌ఖాన్, రియాసత్ అలీ ఎన్నికయ్యారు.

ఏకాగ్రత ఉంటేనే విద్యలో రాణిస్తారు

చొప్పదండి, ఆగస్టు 12: విద్యార్థులకు ఏకాగ్రత ఉంటేనే విద్యారంగంలో రాణించవచ్చని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి అన్నారు. పట్టణంలోని గురుకుల కళాశాలలో నిర్వహించిన స్వాగతోత్సవంలో ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అలివేలు, దీప, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలబోతారంలో వైద్య శిబిరం



గ్రామస్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

సైదాపూర్, ఆగస్టు 12: మండలంలోని ఎలబోతారంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి జి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ కవిత, ఫార్మసిస్టు రాజమణి, ధాయ రీట, స్వామి, ఆశ వర్కర్ అంజలి పాల్గొన్నారు.

‘డాక్టర్‌ను హత్య చేసిన దోషులను శిక్షించాలి’



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది

సుభాష్‌నగర్, ఆగస్టు 12: పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ మెడికల్ కాలేజీలో రాత్రి విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై లైంగిక దాడికి పాల్పడి హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ టీచింగ్, ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కరీంనగర్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న డాక్టర్‌పై లైంగిక దాడికి పాల్పడి హత్యచేయడం అమానుష సంఘటన అని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావత్రుతం కాకుండా ఉండేందుకు దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు డాక్టర్లకు డాక్టర్లు, రక్షణ కల్పించే విధంగా చట్టం రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సంఘటనపై అన్నివర్గాల ప్రజలు స్పందించి తీవ్రంగా ఖండించాలని కోరారు. దేశంలో ఇలాంటి సంఘటలను జరిగిన సందర్భంలో స్పందించే మానవతావాదులు, అభ్యుదయ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు డాక్టర్‌పై జరిగిన పాశవిక చర్యను ఖండించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సమాజం ఈ హత్యను ఖండించాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులతో పాటు చల్మెడ, ప్రతిమ, ప్రభుత్వ మెడికల్ కళాశాలల డాక్టర్లు, పలువురు నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

భగత్‌నగర్, ఆగస్టు 12: కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యనభ్యసించి ఏఎస్‌పీ స్థాయికి ఎదిగిన బోనాల్ కిషన్ 52వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను అందించారు. పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్ అందించిన కిషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుమ్మ ఆనందం ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డయాగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 12: డయాగ్నస్టిక్ సెంటర్ల సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి, కార్యదర్శి ఎడ్ల రమేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు డయా గ్నస్టిక్ సెంటర్లలో స్కానింగ్, ఎక్స్‌రేలు, రక్త, మల, మూత్ర పరీక్షలకు అసాధారణ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్కానింగ్ చేయిస్తే అందులో 50శాతం ఫీజు డాక్టర్‌కు వెళుతుందని ఆరోపించారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శివాలయాల్లో శ్రావణ సందడి

కరీంనగర్ కల్చరల్, ఆగష్టు 12: నగరంలోని శివాలయాల్లో శ్రావణమాసం సందర్భంగా సోమవారం భక్తుల సందడి నెలకొంది. పాతబజార్ గౌరీశంకరాలయం, కమాన్‌రోడ్ రామేశ్వరాలయం, ఆదర్శనగర్ రాజరాజేశ్వరాలయం, జెడ్‌పి క్వార్టర్‌లోని శివాలయంతో పాటు శివలింగాలున్న అన్ని ఆలయాల్లో సమీప ప్రాంతాల భక్తులు శివయ్యను దర్శించుకొని విశేష అభిషేక, అర్చనలు జరిపారు. ఉదయం, సాయంత్రం దీపాలు వెలిగించారు. నమక చమకాలు, రుద్ర సంబంధ స్తోత్రాలు, శివ నామస్మరణలు, భజనలతో ఆలయాలు మార్మోగిపోయాయి.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12: స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చాటేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్ళాలని పార్టీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పార్టీశ్రేణులకు సూచించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామోర సత్యం తెలిపారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో సోమవారం టీటీడీపీ ముఖ్య నాయకులతో చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో ఈమేరకు దిశానిర్దేశం చేసినట్లు సత్యం తెలిపారు. త్వరలోనే పార్టీ సభ్యత్వాల సేకరణ చేస్తామని, పార్టీకి పూర్వవైభవం తెచ్చే విధంగా కృషిచేస్తామని పేర్కొన్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కరీంనగర్ రూరల్, ఆగష్టు12: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో సీజనల్ వ్యాధులపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కళాబృందం వారిచే గ్రామంలో డెంగ్యూచ చికెన్ వ్యాదులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ దుర్గం మురళీ, పొద్దుపొడు శంకర్, గొల్లపల్లి శ్రీకాంత్ చారి, పుల్ల శ్రావణ్, ఒళ్ళల వాణి, కైరి తిరుపతి, పతంగి అర్చన, చిలుమల రాధా సంధ్య, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ రూరల్, ఆగష్టు12: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలోని గాయత్రి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో 2008 నుంచి నిర్వహిస్తున్న మట్టి గణపతుల తయారీ కేంద్రానికి సంబంధించిన పోస్టర్‌ను సోమ వారం బండి సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రి పర్యావరణ సంస్థ ప్రతి సంవత్సరం పర్యావరణ కాలుష్యానికి కారకంగా నిలుస్తున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిర్మూలించే దిశగా తమ వంతు కృషి చేస్తుందని తెలిపారు. సంస్థ ప్రతినిధులు మట్టి గణపతులపై భవిష్యత్తులో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాశం తిరుపతి, బీజేపీ నాయకులు సుధాకర్, సాయవేణి సదానందం, ఆసిరి తిరుపతి, ముందాడ లడ్డు, కమలాకర్‌రెడ్డి, పుట్టపాక శ్రీధర్, పెద్ది లక్ష్మణ్, మెర్గవేని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 12: మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ ధన్గర్‌వాడీ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ సంపత్ కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ రాబర్ట్, ఎన్‌జీవో కేశవరెడ్డి, ఎంఈవో ఎం.మధుసూదనాచారి పాల్గొన్నారు.

●కరీంనగర్ క్రైం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్ఐ విజయభాస్కర్ సూచించారు. సోమవారం కరీంనగర్ రూరల్ మండలం మల్కాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్ర మంలో చైల్డ్ హెల్ప్‌లైన్-1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్, మహిళా సంక్షేమ శాఖ అధికారిణి స్వప్న, ఎక్సైజ్ సిబ్బంది ప్రశాంత్, రమాదేవి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

భగత్‌నగర్, ఆగస్టు 12: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అని జాతీయ మాజీ అధ్యక్షుడు వల్లి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్, పైడిపల్లి రాజు, బూడిద సదాశివ, కేశబోయిన రాము, మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, సునావత్ శ్రీనివాస్, నాయక్, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, రమ్య వర్షిత, పౌర్ణమి, సౌమ్య బోయిన విష్ణు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై నివేదిక ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

చిగురుమామిడి, ఆగస్టు 12: మండలంలోని గ్రామాల్లో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే శాఖల వారీగా నివేదికలు ఇవ్వాలని కరీంనగర్ ఆర్డీవో కె మహేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యలయాంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానిక మంత్రి దృష్టికి తీసుకురావాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భుముల్లో ఎలాంటి అక్రమ కట్టడాలు నిర్మించిన, అనుమతులు లేకుండ నిర్మాణాలు చేసినా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు స్థలాలు ఎంపిక చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎండీ ఖాజామోయినొద్దీన్, తహసీల్దార్ ముద్దసాని రమేష్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ. 7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,450 రూపాయలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 37 క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. వ్యాపారులు వేలం ద్వారా గరిష్ఠ ధర 7,450, కనిష్ఠ ధర 6,900 చెల్లించి కొన్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం





గడిపె సహదేవ్, తిపిరిశెట్టి రమేష్

సైదాపూర్, ఆగస్టు 12: పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని మండల కేంద్రంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడిపె సహదేవ్, ప్రధాన కార్యదర్శిగా తిపిరిశెట్టి రమేష్, అసోసియెట్ అధ్యక్షుడిగా ప్రమోద్‌కుమార్, ఉపాధ్యక్షురాలిగా రామలక్ష్మి, కార్యదర్శులుగా కుమారస్వామి, రజిని ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయపాల్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పాడి పశువుల పోషణతో ఆర్థికంగా ఎదగాలి

సైదాపూర్, ఆగస్టు 12: స్వశక్తి మహిళా సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా ఇస్తున్న రుణాలు తీసుకుని పాడి పశువులను పోషించి ఆర్థికంగా ఎదగాలని డీపీఎం వంగ రవీందర్ అన్నారు. లు సూచించారు. సోమవారం సైదాపూర్ రైతు వేదికలో స్వశక్తి మహిళా సంఘాల మహిళలకు తెలంగాణ పేదరిక నిర్మూళన సంస్థ ఆద్వర్యంలో పాడి పపశువుల పెంపకంపై అవగాహన కలించంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు బ్యాంకులు రుణాల ద్వారా పశువులను కొనుగోలు చేయాలన్నారు. పశువులకు వచ్చే వ్యాధులు, పశుగ్రాసం, దాన, పాల ఉత్పత్తుల గురించి పశువైద్యాధికారి విజేందర్‌రావు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం కుమార స్వామి, సంతోషిమాత మండల సమాఖ్య అధ్యక్షురాలు సమ్ము రజిత, సీసీలు దేవేందర్, రమేష్, పర్శరాములు, శ్రీనివాస్, జమున, రంజిత్, రాజేశ్వరి, ఎస్ఎన్ మేనేజర్ దీప, ఏఈవో నిఖిల్ పాల్గొన్నారు.

● మానకొండూర్: మానకొండూర్‌లోని రైతు వేదికలో పశువుల పెంపకంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి అరవిందరెడ్డి, సుశ్మితారెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎంలు సంతోష్‌కుమార్, నిరంజన్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

శంకరపట్నం, ఆగస్టు 12: మండలంలోని ఆముదాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 14న విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్, విద్యుత్ వినియోగదారుల పోరం చైర్మన్ ఎన్వీ వేణుగోపాలాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలున్న వినియోగదారులు ఈ లోకల్ కోర్టులో వారి సమస్యలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు రాత పూర్వకంగా ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రతి ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎం పోస్టు మంజూరు చేయాలి



అలుగునూర్ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

తిమ్మాపూర్, ఆగస్టు 12: ప్రతి ప్రాథమిక పాఠశాలకు హెడ్ మాస్టర్ పోస్ట్ మంజూరు చేసి, అర్హత కలిగిన ఉపాధ్యాయులతో వెంటనే భర్తి చేయాలని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు పీఆర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో ఎస్టీయూ సంఘ సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఎస్టీయూ సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు డీఎడ్, బీఎడ్ అర్హత కలిగిన ఉపాధ్యాయులందరికి ఎల్ఎఫ్‌హెచ్ఎం పదోన్నతికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నాలుగు పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని, పీఆర్సీ అమలుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు.

పాఠశాలలకు సర్వీస్ పర్సన్లను నియమించి, ఉచిత కరెంటు అమలుకు ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జిల్లా శాఖ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులందరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కొరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా రవీంద్రచారి, కందుకూరి వివేకానంద చారి, విజ్జగిరి రవి, ఎలుగూరి మారుతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఆగస్టు 12: నగరంలో మంగళవారం ఉదయం 9:30గంటల నుంచి 11:30 వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. సప్తగిరి కాలనీ, మంకమ్మతోట, పొన్నం కాంపెక్స్, తెలంగాణచౌక్, కశ్మీర్‌గడ్డ, ముఖరంపుర, గోదాంగడ్డ, భగత్‌నగర్, సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీ, రామచంద్రాపూర్ కాలనీ, శివనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నోట్‌బుక్కుల పంపిణీ

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12: పరంజ్యోతి అమ్మ భగవాన్ జన్మదిన సందర్భంగా పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యానగర్ కురుమవాడలో సోమవారం రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 130మంది విద్యార్థులకు పెన్సిల్‌లు, కంపాక్స్‌లు, రబ్బర్లు, నోట్ బుక్స్‌లను సంతోష్‌నగర్ సమితి నుంచి పెరుక రమ, రాజేందర్, 38వ డివిజన్ కార్పొరేటర్ కచ్చు రవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు హేమలత, వసుంధర, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి వసతి కల్పించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 12: దరఖాస్తు చేసుకున్న ప్రతి బీసీ విద్యార్థికి ప్రభుత్వ బీసీ వసతి గృహంలో వసతి కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నాలుగు బాలకలు, మూడు బాలుర కళశాల స్థాయి వసతి గృహాలు ఉన్నాయని తెలిపారు. కాని దానిలో ఒక్కో వసతి గృహంలో కేవలం 150 మంది విద్యార్థులకు మాత్రమే వసతికి ప్రభుత్వం అనుమతించిందన్నారు. జిల్లా కేంద్రంలో ఒక మహిళ డిగ్రీ కళాశాల, ఒక బాలుర డగ్రీ కళశాల, రెండు ఇంటర్మీడియట్ కళాశాలలు, పది వరకు వృత్తి విద్యా కళాశాలలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాల్లో వసతి కోసం ప్రతి సంవత్సరం వేయి మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారని, అందరికి వారందరికి వసతి దొరకడం లేదన్నారు. ఉమ్మడి కరీంనగర్‌తోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కూడా చదువుకోసం ఇక్కడకు వస్తుంటారని తెలిపారు. అయితే అందరికి వసతి గృహాల్లో వసతి దొరక్కపోవడంతో చదువుకోవాలన్న వారి ఆశ నిరాశగానే మిగిలిపోతుందన్నారు. కావున దరఖాస్తు చేసుకున్న ప్రతి బీసీ విద్యార్థికి వసతి కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మియాపురం రవీంద్రాచారి, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, ఆగస్టు12: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సంజీవరావు గ్రామస్తులను కోరారు. సోమవారం కరీంనగర్ మండలం జూబ్లీనగర్ గ్రామంలోని మహిళా మండలి భవనంలో అన్న ప్రసాన, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్ఠికాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ నిర్మల, మాజీ సర్పంచ్ భారతి, రాము, గ్రామ కార్యదర్శి రమాదేవి, ఏఎన్‌యం సుగుణ, ఎడబ్యూటి స్వరూపరాణి, ఆశ వర్కర్ వసంత, వివిఎ మునీశ్వరి, వివో అధ్యక్షురాలు మల్లీశ్వరి, మహిళలు, గర్భిణిలు, బాలితలు, తల్లులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 12: కార్బన్‌డయాక్సైడ్‌ను విడుదల చేస్తూ ప్రజల శ్వాసకోశ వ్యాదులకు గురి చేస్తున్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ జిల్లా బాధ్యుడు గూడూరి స్వామిరెడ్డి కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనోకార్పస్ చెట్ల వల్ల అనేక శ్వాసకోశ సంబంధిత వ్యాదులు వచ్చే అవకాశం ఉందన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని రోడ్డు మధ్యలో గల డివైడర్‌లో ఈ కోనో కార్పస్ మొక్కలను నాటారని తెలిపారు. ఈ చెట్లను తొలగించి పూలు, పండ్ల మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రచార కార్యదర్శి తులసి లక్ష్మణమూర్తి, గూడూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● హుజూరాబాద్ రూరల్: మండలంలో సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు మంజూరైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అందజేస్తారు.

- బదిలీపై వెళ్లిన ఎంపీవో సురేందర్, సూపరింటెండెంట్ జీవన్‌రెడ్డి, డీఈగా ప్రమోషన్‌పై వెళ్లిన శ్రీకాంత్‌రెడ్డిని పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

● జమ్మికుంట రూరల్: మండలంలోని కోరపల్లి ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఎక్సైజ్ సీఐ మాదవిలత ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు.

● జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి సోమవారం ఫిర్యాదు చేశారు.

● హుజూరాబాద్: పట్టణంలోని రోడ్ల మధ్యలో నాటిన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ యునైటెడ్ ఫోరం జిల్లా బాధ్యుడు గూడూరి స్వామిరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి తులసి లక్ష్మణమూర్తి, గూడూరి చైతన్య కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

- పట్టణంలోని పోస్టాఫీస్ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఉద్యోగులు నిర్వహించారు.

- పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాముయాదవ్ జెండా ఎగురవేశారు.

- పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గతంలో ఇక్కడ పని చేసిన పాలకుర్తి దినకర్ 10 వేల రూపాయల విలువైన పుస్తకాలు అందజేశారు.

- హుజూరాబాద్ గణేష్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు, పిల్లలకు దుప్పట్లు, పుస్తకాలను పంపిణీ చేశారు.

● చొప్పదండి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక రుగ్మతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

- పట్టణంలోని 12,13 వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు ప్రభాకరచార్యులు కోరారు.

● గంగాధర: మండలంలోని లింగంపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

● చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని బంజేరుపల్లికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు నిరసన తెలిపారు.

- మండల కేంద్రాంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు.

- పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా జి అజయ్, కార్యదర్శిగా బి సంపత్, గౌరవ అధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డి, కోశాధికారిగా స్వర్ణలత, ఉపాధ్యక్షులుగా రమణారెడ్డి, కె రమేష్, మౌనిక ఎన్నికయ్యారు.

● తిమ్మాపూర్: మండలంలోని అలుగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయుడు కాను మహేందర్ రాజు ఆధ్వర్యంలో లేఖారచనకు సంబంధించిన మెళకువలు వివరించారు.